జ్వాల తెలుగు న్యూస్

RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

24 మార్చి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 115

# 'మరణ మృదంగం'

## అంతుచిక్కని రోగాలతో రాజోలి మండలం వణుకు!



**పచ్చని పల్లెల్లో పక్షవాతం పంజా..**

**కాలేయం, కిడ్నీ వ్యాధులకు నిలయంగా తుంగభద్ర తీరం!**

**నేరా? శాపమా?**

**రాజోలి మండల ప్రజలను కబళిస్తున్న అజ్ఞాత వ్యాధులు..**

**కన్నరుమున్నరవుతున్న బాధితులు!**

**వైద్యం కోసం ఆస్తులు హారతి నిరుపేద కుటుంబాల్లో అలుముకున్న ఆర్థిక చీకట్లు.**

**జోగులాంబ గద్వాల, మార్చి 23:** ఒకప్పుడు స్వచ్ఛమైన నీరు, సారవంతమైన నేలతో కళకళలాడిన తుంగభద్ర నదీ తీరం ఇప్పుడు మృత్యువుకు చిరునామాగా మారుతోంది. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని గ్రామాల్లో ఎటు చూసినా అనారోగ్య ఆర్తనాదాలే వినిపిస్తున్నాయి. కాలేయం దెబ్బతినడం, కిడ్నీలు ఫెయిల్ కావడం, పక్షవాతం బారిన పడటం ఇక్కడ సర్వసాధారణమైపోయాయి. ఈ అంతుచిక్కని రోగాల వెనుక అసలు కారణం ఏంటో తెలియక ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

**పసిప్రాయంలోనే శస్త్రచికిత్సలు.. కన్నీటి గాథలు**

రాజోలి మండలంలో పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చెప్పడానికి ముజామిల్ హుస్సేన్ అనే పదేళ్ల పిల్లాడి ఉదంతమే సాక్ష్యం. కాలేయం దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ బాలుడిని కాపాడేందుకు తల్లి తన కాలేయాన్నే ఇచ్చింది. దాతల సాయంతో రూ. 25 లక్షలు ఖర్చు చేసి పిల్లాడిని కాపాడుకున్నా, ఆ తల్లి మాత్రం శాశ్వతంగా కన్నుమూసింది. ఇలాంటి కన్నీటి గాథలు ఈ తీరప్రాంతంలో ఇంటికోటి ఉన్నాయి.

**గ్రామాలను చుట్టుముట్టిన పక్షవాతం**

పచ్చర్ల, మాన్‌దొడ్డి వంటి గ్రామాల్లో పక్షవాతం

మిగతా 2లో

# భారతీయుల భద్రత మా బాధ్యత

**హర్మూజ్ సెగలు.. ముడిచమురు సెగలు:**

**ఇంధన ధరల భారం పడకుండా పక్కా ప్లాన్!**

**పశ్చిమాసియా యుద్ధంపై లోక్‌సభలో ప్రధాని ఆందోళన!**



పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ వాణిజ్యానికి ఎదురవుతున్న అడ్డంకులపై ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం లోక్‌సభలో కీలక ప్రసంగం చేశారు. ప్రపంచంలో ఏ మూల సమస్య తలెత్తినా దాని ప్రభావం నేరుగా భారత్‌పై పడుతోందని, ఈ విపత్కర పరిస్థితులను అధిగమించాలంటే దేశం 'స్వయంసమృద్ధి' సాధించడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు.

2

# భారత్ 'దౌత్య' విజయం

**సురక్షితంగా బయటపడ్డ చమురు నౌకలు!**

**దేశంలో తీరనున్న ఇంధన కొరత ఆందోళనలు!**

దేశంలో ఇంధన సంక్షోభం ఏర్పడుతుందన్న భయాందోళనల మధ్య ఊరటనిచ్చే వార్త అందింది. పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి వద్ద నిలిచిపోయిన భారత ఎల్పీజీ, ముడి చమురు నౌకలు ఒక్కొక్కటిగా స్వదేశానికి బయలుదేరాయి. సోమవారం ఉదయం 'జగ్ వసంత్', 'పైన్ గ్యాస్' అనే రెండు భారీ ఎల్పీజీ నౌకలు అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి.



2

తెలుగు రాష్ట్రాల మధ్య...

# సరికొత్త వారధి

## నకిరేకల్ టు ఏర్పేడు..

**హైదరాబాద్ – తిరుపతి ప్రయాణంలో 'ఘాట్' కష్టాలు తీరాయి**

**50 నిమిషాల ప్రయాణం.. ఇక 20 నిమిషాల్లోనే**

**అందుబాటులోకి నేషనల్ హైవే 565..**

**అటవీ లోయల్లో అద్భుత నిర్మాణం!**



**యర్రగొండపాలెం/మార్కాపురం మార్చి 23:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తూ నేషనల్ హైవే 565 పనులు పూర్తి చేసుకుని పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా యర్రగొండపాలెం సమీపంలోని 20 కిలోమీటర్ల అటవీ ప్రాంత విస్తరణ పనులు పూర్తి కావడంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు దశాబ్దాల కాలం నాటి కష్టాల నుంచి విముక్తి లభించింది.

అటవీ అడ్డంకులు అధిగమించి.. అద్భుత నిర్మాణం!

పుల్లలచెరువు నుంచి వెల్దుర్తి మండలం వరకు ఉన్న ఈ 20 కిలోమీటర్ల మార్గం గతంలో అత్యంత ప్రమాదకరంగా, గుంతలమయంగా ఉండేది. అటవీ అనుమతుల జాప్యంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ పనులకు 2024లో మోక్షం లభించింది. రూ. 393 కోట్ల భారీ వ్యయంతో అత్యంత వేగంగా పనులు పూర్తి చేశారు. కొండలు, లోయల గుండా సాగే ఈ మార్గంలో ప్రయాణం సాఫీగా సాగేందుకు ప్రభుత్వం 16 వంతెనలు, 8 అండర్‌పాస్‌లను నిర్మించింది. దీనివల్ల గతంలో 50 నిమిషాలు పట్టే

మిగతా 2లో

మూసీ బాధితుల పునరావాసమే...

# తొలి ప్రాధాన్యత

## బాధితులకు విద్య, వైద్యం, మెరుగైన జీవనం.

**ఫ్యూచర్ సిటీ దిశగా హైదరాబాద్..**

**మెట్రో విస్తరణకు రూ.15 వేల కోట్లు**

**ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యం**

**మూడు జోన్లుగా విభజన..**

**కాలుష్య కోరల నుంచి విముక్తి**

**మెట్రో వేగం – అభివృద్ధి మార్గం**

**మరో 76 కిలోమీటర్ల మేర విస్తరణ..**

**కేంద్రంతో సమన్వయం**

**సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ మార్చి 23:** హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దే క్రమంలో మూసీ నది పునరుజ్జీవం ఒక చారిత్రక అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి పేరిట ఎవరినీ రోడ్డున పడేయబోమని, ప్రతి బాధితుడికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నిరాశ్రయులు కారు.. న్యాయం జరుగుతుంది!

మూసీ పరివాహక ప్రాంత ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని సీఎం పేర్కొన్నారు. "ఎవరినీ నిరాశ్రయులను చేయం. బాధితులందరికీ సకల సౌకర్యాలతో కూడిన పునరావాసం కల్పిస్తాం. వారికి మెరుగైన విద్య, వైద్యం మరియు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత," అని ఆయన ప్రకటించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొట్టే వారి ఉచ్చులో పడవద్దని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ కష్టాలకు చెక్.. మెట్రో విస్తరణ

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు ప్రాజెక్టును మరో 76 కిలోమీటర్ల మేర విస్తరించనున్నట్లు సీఎం వెల్లడించారు. ఇందుకోసం రూ.15 వేల కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, కేంద్రం కూడా సానుకూలంగా స్పందించిందని తెలిపారు. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం ద్వారా నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగులకు ఊరట లభిస్తుందని ఆయన వివరించారు.

మూడు జోన్లుగా తెలంగాణ అభివృద్ధి

రాష్ట్రాన్ని మూడు ప్రధాన జోన్లుగా విభజించి సమతుల్య అభివృద్ధిని సాధిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు:

సర్వీస్ సెక్టార్ అభివృద్ధిపై దృష్టి.

కాలుష్య రహిత పారిశ్రామికీకరణ. ఇందులో భాగంగానే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించడం.

వ్యవసాయ రంగం మరియు అనుబంధ రంగాల అభివృద్ధి.

భవిష్యత్తుపై భరోసా – 'ఫ్యూచర్ సిటీ'

రాబోయే తరాల కోసం 30 వేల ఎకరాల్లో

మిగతా 2లో



# బడ్జెట్ అంతా అంకెల గారడీ

**వాస్తవానికి దూరంగా లెక్కలు**

**పడిపోయిన వృద్ధి రేటు**

**బీఆర్ఎస్ హయాంలో 14% ఉంటే.. ఇప్పుడు 10%కి పరిమితం**

**రైతు సంక్షేమానికి కోత**

**మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ వాస్తవ దూరంగా, ప్రజలను మభ్యపెట్టే విధంగా ఉందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. బడ్జెట్ గణాంకాలను విశ్లేషిస్తూ, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక చక్రం మందగించిందని ఆయన ఆరోపించారు.

2

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
మంగళవారం 24-03-2026

## భారత్ దౌత్య విజయం

**న్యూఢిల్లీ/ముంబై:** దేశంలో ఇంధన సంక్షోభం ఏర్పడుతుందన్న భయాందోళనల మధ్య ఊరటనిచ్చే వార్త అందింది. పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతల కారణంగా హార్మూజ్ జలసంధి వద్ద నిలిచిపోయిన భారత ఎల్పీజీ, ముడి చమురు నౌకలు ఒక్కొక్కటిగా స్వదేశానికి బయలుదేరాయి. సోమవారం ఉదయం 'జగ్ వసంత్', 'పైన్ గ్యాస్' అనే రెండు భారీ ఎల్పీజీ నౌకలు అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి.

**కేంద్రం దౌత్య వ్యూహం ఫలించింది** ఇరాన్ సీనియర్ నేత అలీ లారిజానీ మరణం, ఆ దేశ చమురు క్షేత్రాలపై అమెరికా దాడుల నేపథ్యంలో హార్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు గరిష్ట స్థాయికి చేరాయి. ఈ క్రమంలో భారత నౌకలు రోజుల తరబడి అక్కడే చిక్కుకుపోయాయి. అయితే, భారత్ ఇరాన్ అధికారులతో జరిపిన నిరంతర సంప్రదింపుల ఫలితంగా, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అనుమతితో మన నౌకలు సురక్షితంగా బయటపడగలిగాయి.

**తీరనున్న వంటగ్యాస్ కొరత:** త్వరలోనే ఈ నౌకలు దేశీయ పోర్టులకు చేరుకోనున్నాయి. దీంతో దేశంలో వంటగ్యాస్ లభ్యత పెరిగి, సామాన్యులపై ఇంధన భారం పడకుండా ఉపశమనం లభించే అవకాశం ఉంది. మరికొన్ని ముడి చమురు నౌకలు కూడా ఇదే దారిలో భారత్‌కు వస్తున్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. యుద్ధ మేఘాల మధ్య కూడా భారత సరఫరా గొలుసు దెబ్బతినకుండా ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## భారతీయుల భద్రత మా బాధ్యత..

**న్యూఢిల్లీ మార్చి 23:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ వాణిజ్యానికి ఎదురవుతున్న అడ్డంకులపై ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం లోక్‌సభలో కీలక ప్రసంగం చేశారు. ప్రపంచంలో ఏ మూల సమస్య తలెత్తినా దాని ప్రభావం నేరుగా భారత్‌పై పడుతోందని, ఈ విపత్కర పరిస్థితులను అధిగమించాలంటే దేశం 'స్వయంసమృద్ధి' సాధించడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు.

**హార్మూజ్ జలసంధి.. చమురు సరఫరాకు సవాల్!**
భారత్‌కు అవసరమైన ముడిచమురు, గ్యాస్ సరఫరాలో అత్యధిక భాగం గల్ఫ్ దేశాల నుంచే వస్తుందని ప్రధాని గుర్తుచేశారు. "మన దేశానికి వచ్చే నౌకలన్నీ హార్మూజ్ జలసంధి నుంచే ప్రయాణించాలి. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల అక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. ఇది అంతర్జాతీయ వాణిజ్యాన్ని దెబ్బతీస్తోంది" అని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర మార్గం ద్వారా జరుగుతున్న ఈ సరఫరా గొలుసులో అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

**భారతీయుల భద్రతకే పెద్దపీట:** యుద్ధం జరుగుతున్న గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతపై ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని ప్రధాని తెలిపారు. అక్కడ చిక్కుకున్న వారిని ఇప్పటికే సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చామని, వారి యోగక్షేమాలను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి వల్ల దేశీయంగా ఇంధన ధరలు పెరగకుండా, సామాన్య ప్రజలపై అదనపు భారం పడకుండా కేంద్రం దౌత్య మరియు ఆర్థిక వ్యూహాలను అమలు చేస్తోందని ఆయన వివరించారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య సరికొత్త వారధి

ప్రయాణం, ఇప్పుడు కేవలం 20 నిమిషాల్లోనే పూర్తవుతోంది.

**ప్రధాన నగరాల మధ్య వారధి:**
తెలంగాణలోని నకిరేకల్ వద్ద ప్రారంభమయ్యే ఈ హైవే, ఏపీలోని ఏర్పేడు (తిరుపతి సమీపం) వద్ద ముగుస్తుంది. ఇది నేషనల్ హైవే 65 (హైదరాబాద్-విజయవాడ) మరియు నేషనల్ హైవే 71 (మదనపల్లె-నాయుడుపేట)లను అనుసంధానిస్తుంది.

**వెళ్లే మార్గం:** నకిరేకల్, నల్గొండ, దేవరకొండ, మాచర్ల, యర్రగొండ పాలెం, మార్కాపురం, కనిగిరి, వెంకటగిరి మీదుగా ఏర్పేడు వరకు సాగుతుంది. నల్గొండ, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల నుంచి తిరుపతి వెళ్లే భక్తులకు ఇది ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయ మార్గంగా మారింది.

**పర్యాటక అనుభూతి:** అటవీ ప్రాంతం, కొండలు, లోయల మధ్య ఈ రహదారి విస్తరణ జరగడంతో ప్రయాణికులకు ఇది ఒక సరికొత్త అనుభూతిని పంచుతోంది. మార్కాపురం జిల్లాతో పాటు కడప జిల్లాలోని పోరుమామిళ్ల ప్రాంత ప్రజలకు కూడా హైదరాబాద్ వెళ్లేందుకు ఈ హైవే వరప్రసాదంగా మారింది.

ఎన్‌హెచ్ 565 విశేషాలు:
మొత్తం పొడవు: సుమారు 420 కి.మీ.
ముఖ్య కట్టడాలు: 16 వంతెనలు, 8 అండర్‌పాస్‌లు (20 కి.మీ స్ట్రెచ్‌లో).
ఖర్చు: రూ. 393 కోట్లు (అటవీ ప్రాంత విస్తరణకు).
గమ్యం: ఏర్పేడు వద్ద కుడికి తిరిగితే తిరుపతి, ఎడమకు తిరిగితే శ్రీకాళహస్తి.

## మూసీ బాధితులకు పునరావాసమే తొలి ప్రాధాన్యత

'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఢిల్లీ తరహా కాలుష్య సమస్యలు హైదరాబాద్‌కు రాకుండా ఉండాలంటే ఇప్పుడే కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చిరు వ్యాపారులకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయిస్తూనే, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తామన్నారు. "అభివృద్ధి విషయంలో అందరం ఏకతాటిపైకి రావాలి. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేద్దాం, పరిపాలనలో ప్రజల బాగు కోసం కలిసి పనిచేద్దాం," అని ముఖ్యమంత్రి శాసనమండలి సభ్యులకు సూచించారు

## సమస్యల పరిష్కారమే లక్ష్యం

### – ఎమ్మెల్యే షాజహాన్ బాషా

**మదనపల్లె,మార్చి 23 :** నియోజకవర్గం పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కరించడమే నా లక్ష్యమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. సోమవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడం ఎమ్మెల్యేగా తన బాధ్యత అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఇబ్బందులను నేరుగా తెలుసు కుంటూ వాటిని పరిష్కరించడానికి నిర్విరామంగా పనిచేస్తున్నామని తెలి పారు. ఇప్పటికే నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. ఒకవైపు జిల్లాస్థాయి అధికారులు, మరోవైపు తాము ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజాసమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అనంతరం ప్రజలు అందించిన అర్జీలను సంబంధిత అధికారులకు అందించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

# తుంగభద్ర తీరంలో 'మరణ మృదంగం'..

మహమ్మారిలా విస్తరిస్తోంది. 25 నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న వారు, ముఖ్యంగా కుటుంబానికి ఆధారమైన పురుషులు ఈ వ్యాధి బారిన పడి మంచానికే పరిమితమవుతున్నారు. "మా నాన్నకు ఎలాంటి దురలవాట్లు లేవు, కానీ ఐదేళ్లుగా పక్షవాతంతో పోరాడుతున్నారు. వైద్యం కోసం నా కెరీర్‌నే వదులుకున్నాను. మా ఊరిలో ప్రతి వార్డులోనూ కనీసం ఇద్దరు పక్షవాతం రోగులు ఉన్నారు" అని పచ్చర్ల గ్రామవాసి భూపతి ఆవేదన వ్యక్తం చేశారు.

**తుంగభద్ర నీరే శాపమా?**
ఈ అనారోగ్య సమస్యలన్నింటికీ తాము తాగే తుంగభద్ర నీరే కారణమని బాధితులు బలంగా నమ్ముతున్నారు. నదిలోకి వదులుతున్న పారిశ్రామిక వ్యర్థాలు లేదా నీటిలో ఉన్న ఫ్లోరైడ్ వంటి రసాయనాల వల్ల కాలేయం, కిడ్నీలు దెబ్బతింటున్నాయని వైద్యులు ప్రాథమికంగా అనుమానిస్తున్నా, స్పష్టమైన నిర్ధారణ మాత్రం జరగలేదు. హెపటైటిస్-సి కేసులు కూడా ఇక్కడ భారీగా నమోదవుతుండటం గమనార్హం.

**ప్రభుత్వ స్పందన కోరుతున్న బాధితులు**
వైద్యం కోసం కర్నూలు, హైదరాబాద్ ఆస్పత్రులకు తిరిగి అప్పులపాలవుతున్న ఈ నిరుపేదలను ఆదుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక వైద్య బృందాలను రంగంలోకి దించి, ఇక్కడ నీటి నమూనాలను పరీక్షించి, వ్యాధుల మూలాలను కనుగొనాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. రాజకీయ నాయకులు ప్రకటనలకే పరిమితం కాకుండా, తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని తీరప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బడ్జెట్ అంతా అంకెల గారడీ..

**హైదరాబాద్ మార్చి 23:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ వాస్తవ దూరంగా, ప్రజలను మభ్యపెట్టే విధంగా ఉందని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. బడ్జెట్ గణాంకాలను విశ్లేషిస్తూ, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక చక్రం మందగించిందని ఆయన ఆరోపించారు.

**అంకెల గారడీ.. భారీ ద్రవ్యలోటు!**
"2024-25 బడ్జెట్ అంచనాలకు, వాస్తవ ఖర్చులకు మధ్య రూ. 59,231 కోట్ల వ్యత్యాసం ఉంది. దీన్ని రియలిస్టిక్ బడ్జెట్ అని ఎలా అంటారు భట్టి గారు?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ ఏడాది కూడా బడ్జెట్‌లో రూ. 45 వేల కోట్ల నుంచి రూ. 50 వేల కోట్ల వరకు లోటు ఉండే అవకాశం ఉందని, కేవలం భ్రమలు కల్పించడానికే భారీ అంకెలు వేశారని మండిపడ్డారు.

**గ్రోత్ రేట్ పతనం – 'తెలంగాణ రైజింగ్' ఎక్కడ?**
రాష్ట్ర జీఎస్డీపీ మరియు తలసరి ఆదాయం వృద్ధి రేటు గణనీయంగా పడిపోయిందని హరీశ్ విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో సగటున 14 శాతం ఉన్న తలసరి ఆదాయ వృద్ధి రేటు, ప్రస్తుతం 10.2 శాతానికి పడిపోయిందని గుర్తుచేశారు. "ఒకవైపు వృద్ధి రేటు పడిపోతుంటే.. సీఎం రేవంత్ రెడ్డి ఏమో 'తెలంగాణ రైజింగ్' అని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది" అని ఎద్దేవా చేశారు.

**ఎక్సైజ్ ఆదాయంపై నిలదీత – మద్యం ఏరులై పారాల్సిందేనా?**
గత ఏడాదితో పోలిస్తే ఎక్సైజ్ ఆదాయం ద్వారా అదనంగా రూ. 12,338 కోట్లు సంపాదిస్తామని ప్రభుత్వం చెప్పడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఇంత భారీ ఆదాయం రావాలంటే గల్లీ గల్లీకి బెల్ట్ షాపులు, ఊరూరా బార్ షాపులు పెడతారా? రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా మార్చడమే మీ లక్ష్యమా?" అని నిప్పులు చెరిగారు.

**రైతులు, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం**
వ్యవసాయ రంగానికి కేటాయింపుల్లో కోతలు విధించారని హరీశ్‌రావు ఆరోపించారు. గతంలో బీఆర్‌ఎస్ రూ. 28,594 కోట్లు ఖర్చు చేస్తే, ఈ బడ్జెట్‌లో కేవలం రూ. 23,179 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. రైతుబంధు, రుణమాఫీ బకాయిలు చెల్లించకుండా అన్నదాతలను వంచించారని మండిపడ్డారు. అలాగే, రూ. 8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టి 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చారని ధ్వజమెత్తారు.

**విధ్వంసకర నిర్ణయాలతో ఆదాయానికి గండి**
హైడ్రా , భూముల నిషేధం వంటి తలాతోక లేని నిర్ణయాల వల్ల ప్రభుత్వ ఆదాయం గణనీయంగా తగ్గిందని హరీశ్ ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో కూడా తగ్గని ఆర్టీఏ ఆదాయం, కాంగ్రెస్ పాలనలో తగ్గిందంటే ప్రజల కొనుగోలు శక్తి ఎంతలా క్షీణించిందో అర్థమవుతోందని విమర్శించారు.

# రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా ఉండాలి

### – బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

**జన్నారం, మార్చి 23 :** మండల కేంద్రంలోని ధర్మారం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త నెమలికొండ సతీష్ ఇటీవల బైక్ ప్రమాదానికి గురై కాలు విరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నిర్మల్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ బాధితుడిని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సతీష్ ఒక నిరుపేద కార్యకర్త అని,ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని రితేష్ రాథోడ్ మండల కమిటీకి మరియు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సతీష్‌ను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కోరుతూ, ఆర్థిక సాయం చేయదలచిన వారు క్రింది నంబర్‌కు నగదు పంపవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

సహాయం చేయాల్సిన వివరాలు
ఫోన్ పే / గూగుల్ పే నంబర్ 7013580352. ఈ పరామర్శ కార్యక్రమంలో జన్నారం మండల అధ్యక్షులు జి. మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి ఎరుకల రమేష్ గౌడ్, కిషన్ మోర్చా అధ్యక్షులు బెడద గోపాల్, ధర్మారం బూత్ అధ్యక్షులు పూర్ణచారి, గ్రామ నాయకులు పెద్ది ప్రభాకర్, రమేష్ చారి, రామచంద్రం, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఓబీసీల అభ్యున్నతి కోసం

# బాధ్యతగా ముందడుగు

### టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### గాంధీభవన్‌లో ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం

**(స్పెషల్ కరస్పాండెంట్) హైదరాబాద్/షాద్‌నగర్, మార్చి,23, మెదక్ టుడే న్యూస్:(స్టేట్ బ్యూరో)** ఓబీసీ వర్గాల అభ్యున్నతి కోసం అంకితభావంతో కృషి చేస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఆయన టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శంకర్ మాట్లాడుతూ, ఓబీసీ వర్గాల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని, సామాజిక న్యాయం సాధనలో ముందుండి పని చేస్తానని స్పష్టం చేశారు. ఓబీసీ సమాజానికి అవకాశాలుపెంపొందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, వీర్లపల్లి శంకర్ నాయకత్వంలో ఓబీసీ విభాగం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన సామర్థ్యానికి తగిన బాధ్యతను పార్టీ అధిష్టానం అప్పగించిందని పేర్కొన్నారు. అభినందనల వెల్లువప్రమాణ స్వీకారోత్సవానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అసెంబ్లీ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, సీనియర్ నాయకుడు కాశీనాథ్ రెడ్డి తదితరులు హాజరై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను అభినందించారు. షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు గాంధీభవన్‌కు తరలివచ్చారు. ప్రమాణ స్వీకారం అనంతరం జయజయధ్వానాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అందే మోహన్‌కు ప్రత్యేక ప్రాధాన్యంఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్, తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మోహన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీర్లపల్లి శంకర్ ప్రజల కోసం ఎల్లప్పుడూ కృషి చేసే నాయకుడని కొనియాడారు. శంకర్ నాయకత్వంలో ఓబీసీ వర్గాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని, రాష్ట్రంలో మరింత బలమైన ప్రతినిధిత్వం పొందుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.





# అమరవీరులకు తపస్ ఘన నివాళి

**చేగుంట మార్చి 23 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం( తపస్) ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవ వీరులుగా గుర్తింపు పొందిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించిన తపస్ నాయకులు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజగుర్, సుఖ్ దేవ్ లను 1931 మార్చి 23న బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసింది అని, దేశం కోసం వారు చేసిన ప్రాణత్యాగానికి గుర్తుగా భారతదేశంలో ప్రతి ఏటా మార్చి 23వ తేదీని 'షహీద్ దివస్' (అమరవీరుల దినోత్సవం) గా జరుపుకుంటాం అని, నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకొని దేశభక్తిని కలిగి ఉండాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు రావుల వెంకటేష్, వేముల శ్రీనివాస్,సిఆర్పి రమేష్ తదితరులు పాల్గొన్నారు



# సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

**(స్పెషల్ కరస్పాండెంట్) షాద్ నగర్,మార్చి,23,**మెదక్ టుడే న్యూస్:(స్టేట్ బ్యూరో) శంకర్ అన్న నాయకత్వం నిబద్ధతకు నిదర్శనమని 6వ వార్డు కౌన్సిలర్ డి. రాజు నాయక్ పేర్కొన్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ టీపీసీసీ ఓబీసీ విభాగం చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల పట్టణంలో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌కు ఈ బాధ్యతలు రావడం గర్వకారణమన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించడం పార్టీకి మరింత బలం చేకూర్చుతుందని తెలిపారు.ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా సమర్థవంతంగా సేవలందిస్తున్న శంకర్ అన్న, ఇప్పుడు టీపీసీసీ ఓబీసీ విభాగం చైర్మన్‌గా కూడా ప్రజలకు మరింత దగ్గరగా ఉండి సేవలందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.రాజకీయాల్లో ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.





## జయహో శంకరన్న

### కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి శంకర్ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు

**(స్పెషల్ కరస్పాండెంట్)షాద్‌నగర్,మార్చి,23,మెదక్ టుడే న్యూస్:(స్టేట్ బ్యూరో)** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం చైర్మన్‌గా నియమితులైన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఆయనను ప్రత్యేకంగా కలుసుకుని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు .హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో శంకర్‌ను శాలువాతో సన్మానించి,పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా ఓబీసీ వర్గాల అభివృద్ధికి శంకర్ నాయకత్వం ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంలో శంకర్ కి ఉన్న అనుభవం, నిబద్ధత ఈ కొత్త బాధ్యతలో మరింత ప్రతిఫలిస్తుందని ఆయన పేర్కొన్నారు.అలాగే, ఈ పదవిలో శంకర్ విజయవంతంగా పనిచేసి పార్టీకి, ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.



# సామాజిక న్యాయ సాధనలో ముందుండి నడిచే నేత మన శంకర్ అన్న

### -షాద్ నగర్ సీనియర్ నాయకులు, మైనార్టీ నేత ఎం.డి. ఇబ్రహీం.

**షాద్ నగర్,మార్చి,23,మెదక్ టుడే న్యూస్:(స్టేట్ బ్యూరో)**తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుందని, షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ఓబీసీ విభాగం చైర్మన్‌గా అధికారికంగా బాధ్యతలు స్వీకరించాడం హర్షించదగ్గ విషయమని సీనియర్ నాయకులు, మైనార్టీ నేత ఎండి ఇబ్రహీం కొనియాడారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో గాంధీభవన్లో సోమవారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఓబిసి చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన శుభసందర్భంగా ఆయనను మైనార్టీ నేత ఇబ్రహీం కలుసుకొని పుష్పగుచ్చం అందజేసి ప్రత్యేక శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నేత ఇబ్రహీం మాట్లాడుతూ, సామాజిక న్యాయ సాధనలో శంకర్ అన్న ఎప్పుడూ ముందుంటారని, ఓబీసీ చైర్మన్‌గా ఆయన నియామకం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు.శంకర్ అన్న నాయకత్వంలో ఓబీసీ విభాగం మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో స్థానిక నేతలు, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు మార్చి 23** నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.రాష్ట్రంలోని నగర/పుర పాలక సంఘాల పాలక వర్గాలకు గడువు ముగియడంతో ఆయా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చిత్తూరు నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిగా నియమితులైన జిల్లా కలెక్టర్ సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ పి నరసింహ ప్రసాద్ కలెక్టర్ కి పుష్పగుచ్చాలు అందించారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన యువ నాయకుడు సంద్రుగు శ్రీకాంత్



**చేగుంట మార్చ్ 23 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలశీ గొల్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ యాపర్ల శివయ్యమరణించిన విషయం తెలుసుకున్న సంద్రుగు శ్రీకాంత్ ,దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం మరియు 50 కేజీ ల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో యాపర్ల రవి,యాపర్ల మల్కాయ,శ్రీకాంత్, ప్రవీణ్ ,నవీన్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## చెరుకు శ్రీనివాస్ రెడ్డిని కలిసిన కార్యవర్గ సభ్యులు



**చేగుంట మార్చ్ 23 మెదక్ టుడే న్యూస్** చేగుంట నూతనంగా నియమితులైన మెదక్ డిసిసి ఉపాధ్యక్షుడు రజనకు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి భాగ్యరాజు శనివారం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలిపారు తమకు జిల్లా కాంగ్రెస్ కమిటీలో చోటు కల్పించినందుకు శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు చేగుంట మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని డిసిసి కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు మరింత అభివృద్ధి పథంలో ముందు ఉంచుతామని అన్నారు.

## మాకు సార్టిఫికెట్లు ఇపియండి

### ప్రజావాణిలో విద్యార్థులు ఫిర్యాదు 30,000 ఇస్తేనే సర్టిఫికెట్లు ఇస్తాము అంటున్న యాజమాన్యం




**చేగుంట మార్చ్ 23 మెదక్ టుడే న్యూస్** చేగుంట లోని శ్రీ సాధన డిగ్రీ కళాశాల యాజమాన్యం తమను వేధిస్తోందని 11 మంది విద్యార్థులు ప్రజావాణిలో అదనపు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.కళాశాల లో చేరే సమయంలో కేవలం స్కాలర్షిప్ మాత్రమే తీసుకుంటామని చెప్పి, ఇప్పుడు ఒక్కొక్కరు రూపాయలు 30,000 చెల్లిస్తేనే ఒరిజినల్ మెమోలు ఇస్తామని మొండికేస్తున్నారని ఆరోపించారు. తమ సర్టిఫికెట్లు ఇప్పించి న్యాయం చేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

## ప్రశాంతంగా 10 వ తరగతి పరీక్షలు

**యాదమరి మార్చి 23** యాదమరి మండల కేంద్రంలో జడ్పీ హైస్కూల్ నందు 10వ పరీక్షలు అన్ని వసతులతో అధికారులు నిర్వహించారు పోలీసుల నిగాలో ప్రశాంతంగా పరీక్షలు జరిగినాయి అధికారులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని పకడ్బందీగా నిర్వహించినారు




# ముంబై స్లమ్స్‌లో 'రౌడీ జనార్ధన'..!



టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.

# కంటెంట్‌కే ప్రాధాన్యం..

ప్రస్తుతం సినీ పరిశ్రమలో స్పష్టమైన మార్పు ఒకటి కనిపిస్తోంది. స్టార్ హీరోల క్రేజ్ కంటే కంటెంట్‌కే ప్రేక్షకులు ప్రాధాన్యం ఇస్తున్నారు. హీరో ఎవరు అన్నది కాకుండా సినిమా ఎలా ఉందన్నదే బాక్సాఫీస్ ఫలితాలను నిర్ణయిస్తోంది. మొదటి రోజు ఓపెనింగ్స్‌కు స్టార్ పవర్ పని చేసినా, రెండో రోజు నుంచే అసలు రిజల్ట్ బయటపడుతోంది. ఇటీవల ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్' విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు పవన్ కళ్యాణ్ హీరోగా వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా అదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఉగాది సందర్భంగా విడుదలైన ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహించగా, శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయిన తర్వాత విడుదలైన మూడో సినిమా కావడం విశేషం. అంతకుముందు వచ్చిన 'హరిహర వీరమల్లు', 'ఓజీ' చిత్రాలు వేర్వేరు ఫలితాలను అందించాయి. అందులో ఒకటి డిజాస్టర్ కాగా, మరొకటి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్' విషయానికి వస్తే, మొదటి రోజు మంచి ఓపెనింగ్స్ వచ్చినప్పటికీ, ఆ తర్వాత కలెక్షన్లు క్రమంగా పడిపోతున్నాయి. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ సినిమా నాలుగు రోజుల్లో సుమారు రూ.82 కోట్ల గ్రాస్ మాత్రమే వసూలు చేసింది. నాలుగో రోజు కలెక్షన్లు దాదాపు రూ.8 కోట్ల వద్దే నిలవడం ఆందోళన కలిగిస్తోంది. పవన్ కళ్యాణ్ వంటి స్టార్ హీరో సినిమాకి ఇవి తక్కువ వసూళ్లుగా భావిస్తున్నారు. సుమారు రూ.150 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి రూ.123 కోట్ల వరకు బిజినెస్ జరిగినట్లు సమాచారం. బ్రేక్ ఈవెన్ అవ్వాలంటే కనీసం రూ.150 కోట్లకు పైగా వసూళ్లు అవసరం. ప్రస్తుతం ఉన్న ట్రెండ్ చూస్తుంటే ఆ లక్ష్యాన్ని చేరుకోవడం సవాలుగా కనిపిస్తోంది. అయితే రెండో వారం వరుస సెలవులు, ప్రత్యేకంగా శ్రీరామ నవమి, వీకెండ్ కలిసి రావడం ఈ చిత్రానికి కొంత ఊరట కలిగించే అవకాశం ఉంది. ఏది ఏమైన స్టార్ హీరో ఉన్నా సరే కంటెంట్ బలంగా లేకపోతే సినిమా నిలబడదన్న విషయాన్ని 'ఉస్తాద్ భగత్ సింగ్' మరోసారి స్పష్టం చేసింది. ఇక ఈ సినిమా రెండో వారం కలెక్షన్లు ఎలా ఉంటాయో, పరిస్థితి మారుతుందో లేదో చూడాలి.



# ధురంధర్ 2' బాక్సాఫీస్ సునామీ..



బాలీవుడ్‌లో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ ధురంధర్ 2 ప్రస్తుతం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సీక్వెల్ చిత్రం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ రికార్డుల వేటలో దూసుకుపోతోంది. మొదటి భాగానికి కొనసాగింపుగా వచ్చిన ఈ మూవీ, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, గ్రిప్పింగ్ స్పై ఎలిమెంట్స్, అద్భుతమైన ట్విస్ట్‌లతో ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేస్తోంది. విడుదలైన ప్రతి ప్రాంతంలోనూ ఈ సినిమాకు హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తుండటం దీని సక్సెస్‌ను స్పష్టం చేస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రం విడుదలైన మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. అంతేకాకుండా, నాలుగు రోజుల్లోనే ఈ మూవీ రూ.750 కోట్ల మార్క్‌ను టచ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో తొలి వీకెండ్‌కే పలు రికార్డులను ఈ సినిమా బద్దలు కొట్టింది. ఇప్పటివరకు ఉన్న భారీ రికార్డులను కూడా 'ధురంధర్ 2' అధిగమించింది. ముఖ్యంగా బాహుబలి 2 (రూ.591 కోట్లు), ఆర్ఆర్ఆర్ (రూ.470 కోట్లు) సాధించిన ఓపెనింగ్ వీకెండ్ వసూళ్లను ఈ చిత్రం దాటేసింది. అయితే హయ్యెస్ట్ ఓపెనింగ్ వీకెండ్ రికార్డ్ విషయంలో మాత్రం పుష్ప 2 (రూ.762 కోట్లు) తర్వాత రెండో స్థానంలో నిలిచింది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ప్యాక్డ్ పర్ఫార్మెన్స్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించగా, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సారా అర్జున్ తదితరులు తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. యాక్షన్, ఎమోషన్, దేశభక్తి మేళవింపుతో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, 2026లో అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే వేగంతో వసూళ్లు కొనసాగితే, త్వరలోనే ఈ సినిమా రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# పిల్లల ప్రైవసీని గౌరవించాలి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కుమారుడు అకీరా నందన్ హీరోగా ఎంట్రీ ఇవ్వాలని అభిమానులు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. 'ఓజీ' సినిమాలో చిన్న పవన్ పాత్రను అకీరా చేస్తే బాగుండేదనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో మెగా డాటర్ నిహారిక కొణిదెల తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అకీరా గురించి మాట్లాడుతూ నిహారిక ప్రేమగా "మై స్మాల్ బిగ్ బేబీ" అంటూ అభివర్ణించారు. "అకీరా హార్ట్ ఆఫ్ గోల్డ్. బాబాయ్ పవన్ కళ్యాణ్‌లాగే ఎక్కువ మాట్లాడడు. కానీ ప్రేమ మాత్రం చాలా ఎక్కువ. హీరో అవుతాడా లేదా అనే విషయం నాతో డైరెక్ట్‌గా చెప్పలేదు. మీడియా ఎక్స్‌పోజర్ వల్లే ఈ విషయంపై ఎక్కువ ప్రచారం జరుగుతోంది" అని తెలిపారు. ఇటీవల 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్ల వద్ద అకీరాను "ఒమేగా స్టార్"గా పేర్కొంటూ ప్లకార్డులు కనిపించడం పై కూడా నిహారిక స్పందించారు. సెలబ్రిటీ పిల్లల ప్రైవసీకి భంగం కలిగించే విధంగా వ్యవహరించడం సరైంది కాదని ఆమె స్పష్టం చేశారు. మా టైంలో సోషల్ మీడియా అంతగా లేదు. అందుకే మా బాల్యం బాల్యంగానే గడిచింది. ఇప్పుడు పిల్లల ప్రైవసీని గౌరవించాలి. అది అభిమానంగా కాదు, అబ్యూస్‌గా మారుతోంది అంటూ గట్టిగా హెచ్చరించారు. ఇక తన వ్యక్తిగత జీవితంపై కూడా నిహారిక ఓపెన్‌గా మాట్లాడారు. తన వివాహ బంధం విరగడానికి ఒక్క కారణం ఉండదని, అనేక అంశాలు కలిసి ప్రభావం చూపుతాయని చెప్పారు. రిలేషన్‌షిప్ నుంచి బయటకు రావాలని నిర్ణయించినప్పుడు ముందుగా నాన్న నాగబాబుగారితో మాట్లాడాను. నేను సంతోషంగా లేనని ఆయన అర్థం చేసుకున్నారు. జీవితంలో హ్యాపీగా లేకపోతే బలవంతంగా కొనసాగించాల్సిన అవసరం లేదని ఆయనే చెప్పారు అని వివరించారు. కాగా, 2020లో చైతన్య జొన్నలగడ్డను వివాహం చేసుకున్న నిహారిక, 2023లో పరస్పర అంగీకారంతో విడిపోయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రెండో పెళ్లిపై స్పందిస్తూ, నేను ఇప్పుడే పెళ్లి చేసుకునే ఆలోచనలో లేను. కానీ పెళ్లి మాత్రం చేసుకుంటాను. విధి రాతను నమ్ముతాను. సరైన వ్యక్తి నా జీవితంలోకి రావాల్సి ఉంటే తప్పకుండా వస్తాడు అని చెప్పారు. సినిమాల విషయానికి వస్తే, నటనకు బ్రేక్ ఇచ్చిన నిహారిక ప్రస్తుతం నిర్మాతగా సత్తా చాటుతున్నారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై వరుస ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. తాజాగా సంగీత్ శోభన్ హీరోగా 'రాకాస' అనే సినిమాను నిర్మించగా, ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఎలాంటి సంబంధం లేదు

ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి ఎలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, "నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వారి ఫైనాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదు" అని తెలిపారు.



# 12 ఏళ్ల తర్వాత రీఎంట్రీ..!

తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో, ఇప్పుడు మరో ఫైర్‌బ్రాండ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్బే దయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'పెరంబూర్ గానా' సాంగ్ మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా ఈ పాటలో రోజా చేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు. ఈ పాట వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా లిరికల్ వీడియోలు విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS
H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.
medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..